
సాక్షి
ఏలూరు
గురువారం । 21 । మార్చి । 2024



అడవులపైనే మానవుని భవిత

అడవుల సంరక్షణపై అవగాహనకు ఏటా మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. **ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.** 8లో ▸



కొల్లేటికోటలో నేడు కల్యాణం

కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గా, గోకర్ణేశ్వర స్వామి కల్యాణం గురువారం రాత్రి నిర్వహించనున్నారు. 8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సాయంత్రం)	సహరి శుక్రవారం (ఉదయం)
ఏలూరు	6.24	4.44
భీమవరం	6.21	4.48

కూటమిలో సీట్ల కుంపటి



- నరసాపురం సీటుపై రగడ
- జనసేన సీటు తనకే ఇచ్చారంటున్న నాయకర్
- పార్టీ నుంచి సమాచారం లేదంటున్న మాజీ మంత్రి కొత్తపల్లి
- ఉండిలో మాజీ ఎమ్మెల్యే శివ తిరుగుబావుటా
- టీడీపీ రెబల్‌గా బరిలో దిగేందుకు ప్రయత్నాలు
- తణుకులో మౌనం వీడని విడివాడ
- భీమవరంలో అంతుపట్టని అంజిబాబు వైఖరి

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో అసంతృప్తి సెగలు చల్లారడం లేదు. తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండన్న ధోరణిలో సీట్ల కేటాయింపులు చేశారని కేడర్ మండిపడుతుంది. అధినాయకత్వాల తీరు పట్ల ఆగ్రహంతో రగిలిపోతున్నారు. జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లో విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఉండిలో రెబల్‌గా బరిలో దిగేందుకు కలవపూడి శివ సిద్ధమవుతుండగా.. భీమవరంలో జనసేన అభ్యర్థితో ఆ పార్టీ నేతలే అంటీముంటనట్లుగా ఉన్నారు. నరసాపురంలో సీటుపై రగడతో కేడర్ అయోమయంలో పడిపోయింది. తణుకులో విడివాడ వర్గం టీడీపీకి సహకరించేందుకు ఇష్టపడడం లేదు.

నాయకర్ వర్సెస్ కొత్తపల్లి

జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు పొత్తులో భాగంగా భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం నియోజకవర్గాలు జనసేన, తణుకు, ఆచంట, పాలకొల్లు, ఉండి నియోజకవర్గాల్లో టీడీపీ తమ అభ్యర్థులను బరిలో దింపింది. ఇటీవల విజయవాడలో పవన్‌కళ్యాణ్‌ను కలిసిన జనసేన నాయకుడు బొమ్మిడి నాయకర్ నరసాపురం సీటు తనకే ఇచ్చారంటూ ప్రకటించుకోవడంతో పాటు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. ప్రజాగళం సభకు సంఘీభావ ర్యాలీ సందర్భంగా నాయకర్‌కు సీటు కేటాయింపుపై తనకు సమాచారం ఏమీ లేదని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు చేసిన వ్యాఖ్యలు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల జనసేనలో చేరిన సుబ్బారాయుడు సీటు తనదేనంటూ ప్రచారం చేసుకున్నారు. అటు నాయకర్, ఇటు కొత్తపల్లి ఎవరికి వారు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది. తాజాగా సుబ్బారాయుడు వ్యాఖ్యల నేపథ్యంలో నరసాపురం సీటు పంచాయితీ కొలిక్కివచ్చినట్టు లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. మరోవైపు టీడీపీలోను వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. గత రెండు రోజులుగా మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు వర్గం, ప్రస్తుతం పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న పొత్తూరి రామరాజు వర్గం ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. రామరాజు ఇన్‌చార్జి బాధ్యతలను మరి కొద్ది రోజుల్లో పీకేస్తారంటూ బండారు వర్గం ప్రచారం చేస్తుండగా బండారుకు పార్టీలో స్థానమే ఉండదంటూ రామరాజు వర్గం చేస్తున్న వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో మూడో స్థానానికి పరిమితమైన టీడీపీ తాజా పరిణామాలతో మరింత దిగజారుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

పార్టీ కార్యక్రమాలకు దూరంగా విడివాడ వర్గం

వారాహి యాత్ర సందర్భంగా పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీతో తణుకు టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావుకు అధినేత నిర్ణయం మింగుడు పడటం లేదు. తణుకు సీటు టీడీపీకి కేటాయించడంపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న విడివాడ వర్గం అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉండిపోయింది. తాడేపల్లిగూడెం జెండా సభ ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు వచ్చిన సందర్భంగా విడివాడ అనుచరుల నిరసన నేపథ్యంలో న్యాయం చేస్తామని మాటిచ్చిన నాదెండ్ల మనోహర్ తర్వాత కనీసం పలకరించింది లేదు.

అంజిబాబుపై అసంతృప్తి

భీమవరంలో గత ఐదేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటూ ఇటీవల జనసేన సీటు తెచ్చుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కేడర్‌ను దగ్గరకు చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. ఇప్పటికే జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అంజిబాబు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తుండగా గత పది రోజులుగా జనసేనను దగ్గరకు చేసుకునే ప్రయత్నాల కంటే పాత పరిచయాలున్న టీడీపీ కేడర్ పట్ల ఎక్కువ మక్కువ చూపిస్తున్నారంటూ జనసేనలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అంజిబాబు ప్రవర్తన చూస్తుంటే టీడీపీ అభ్యర్థా, లేక జనసేన అభ్యర్థా అనే సందేహం వ్యక్తమవుతోందని జనసేన కేడర్ వాపోతోంది. దీంతో అంజిబాబు పరిస్థితి కుడితిలో పడ్డ ఎలకలా తయారైందని నియోజకవర్గంలో చర్చించుకుంటున్నారు.

ఉండి బరిలో కలవపూడి శివ

ఉండి నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు (కలవపూడి శివ) తిరుగుబావుటా ఎగురవేయడంతో కూటమి గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయ్యింది. టిక్కెట్ కేటాయింపుపై చంద్రబాబు తనను సంప్రదించకపోవడం ఎంతో వేదనకు గురిచేసిందన్న ఆయన ఉండి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని ప్రకటించారు. ఆ మేరకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో తనకున్న పరిచయాలతో కేడర్‌ను సమాయత్తం చేసుకుంటూ టీడీపీ రెబల్‌గా బరిలో దిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పవన్‌కళ్యాణ్ కేవలం 21 సీట్లుకే పరిమితం కావడం పట్ల జనసేన కేడర్ టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపడం లేదు. మిత్రపక్షం కేడర్ కలిసిరాకపోవడంతో టీడీపీ నాయకులే ఇక్కడ ఆ పార్టీ జెండాలు వెంటేసుకుని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

న్యూస్‌రీల్

పోలవరంలో ఈదురుగాలులు



పోలవరంలో ఈదురుగాలుల ప్రభావంతో విలిగిపడిన మొక్కజొన్న

పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో పోలవరంలో బుధవారం మధ్యాహ్నం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మండలంలోని పలు ప్రాంతాల్లో మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. రైతులు వర్షం తగ్గిన వెంటనే పంట పొలాలకు వెళ్ళి మొక్కజొన్న చేలను పరిశీలించారు. మొక్కజొన్న కండెలు విరిగి పడిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడగా.. అధికారులు స్పందించి పునరుద్ధరణ చేశారు.

దూరవిద్య పరీక్షలకు 1,751 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించిన పబ్లిక్ పరీక్షలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 7 కేంద్రాల్లో నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 776 మందికి 674 మంది హాజరు కాగా 102 మంది గైర్హాజరయ్యారు. 9 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ పరీక్షకు 1176 మందికి 1077 మంది హాజరు కాగా 99 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని నూజివీడు శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షలో ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ



లోకుమూడి ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌ఓ శర్మిష్ట

ఏలూరు (టూటౌన్): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ శర్మిష్ట లోకుమూడి, తక్కెళ్ళపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఆర్ఎస్‌ను ఉదయం 9 గంటలకు వేయాలని, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కై కలూరులోని ప్రైవేటు ఆస్పత్రులు, స్కాన్ సెంటర్లను తనిఖీ చేశారు. తగిన సూచనలిచ్చారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో హెల్త్ ప్రొవైడర్ల నమోదు తప్పనిసరని సూచించారు.

ఫైబర్‌నెట్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్‌వర్క్ లిమిటెడ్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోని ఖాతాదారులకు ప్రసారాలు నిలిపివేస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.మధుసూదన రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవాలని మెసేజ్‌ల ద్వారా తెలిపామని, కొందరు ఖాతాదారులు సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకోని విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోని ఖాతాదారులకు ఎల్ఎంఓలు సాంకేతికంగా సహకరిస్తారన్నారు.

ఉత్తమ సేవా పతకానికి ఎంపిక



ఎంజేవీ భాస్కర రావు, అదనపు ఎస్పీ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా పనిచేసి ఇటీవల బదిలీపై కాకినాడ జిల్లా అదనపు ఎస్పీగా వెళ్లిన ఎంజేవీ భాస్కరరావుకు ఉగాదిని పురస్కరించుకుని ఉత్తమ సేవా పతకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. 1989 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఎంజేవీ భాస్కరరావు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్ఐగా, సీఐగా అనేక ప్రాంతాల్లో పనిచేశారు. డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన ఇంటిలిజెన్స్ డీఎస్పీగా పనిచేశారు. అనంతరం అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఎన్నికల నియమావళి నిబంధనల్లో భాగంగా ఆయనను కాకినాడ జిల్లాకు బదిలీ చేశారు. ఏలూరు జిల్లాలో పనిచేసిన కాలంలోనే ఉత్తమ సేవలు అందించినందుకుగాను ప్రభుత్వం ఉత్తమ సేవా పతకాన్ని ప్రకటించింది.

సృజనాత్మకత పెంచేందుకు కళలు దోహదం

ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్



ట్రిపుల్‌ఐటీ ఆవరణలో ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ఎం.విజయ్ కుమార్

నూజివీడు: విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను, కళా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి కళలు ఎంతగానో దోహదపడతాయని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్ అన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ ఆవరణలోని శ్రీకాకుళం క్యాంపస్‌కు చెందిన ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చిత్రాలు వారిలో ఉన్న సృజనాత్మకతకు అద్దంపట్టేలా ఉన్నాయన్నారు. క్యాంపస్‌లో ఉన్న అధ్యాపకులు, విద్యార్థులందరూ ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను తిలకించి వారిలో నూతనోత్తేజాన్ని పెంపొందింపచేయాలన్నారు. ఎగ్జిబిషన్‌లో పెన్సిల్ ఆర్ట్, మండానా ఆర్ట్, పోర్‌ట్రైట్ ఆర్ట్, పోస్టర్ కలర్ ఆర్ట్స్, పెన్ ఆర్ట్, వాటర్ కలర్ ఆర్ట్‌ల విభాగంలో విద్యార్థుల చిత్రాలను ప్రదర్శించారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన చిత్రాలకు సంబంధించి నగదు బహుమతిని అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, నూజివీడు డైరెక్టర్‌లు ఆచార్య కేవీజీడీ బాలాజీ, ఆచార్య ఎం.చంద్రశేఖర్, రిటైర్డ్ వీసీ కేవీ రావు, ఓఎస్‌డీ సుధాకర్‌బాబు, రీసెర్చ్ హెడ్ ఆచార్య ఎం.మోహన్‌రావు, ఆర్జీయూకేటీ డీన్ దువ్వూరు శ్రావణి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర దక్కేలా కృషిచేస్తాం

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్



జంగారెడ్డిగూడెంలో వేలం తీరును పరిశీలిస్తున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్

జంగారెడ్డిగూడెం: వేలం ప్రక్రియలో ధర విషయంలో రైతులు అసంతృప్తితో ఉన్నారని, త్వరలోనే వ్యాపారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తామని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం -1, -2 వర్జీనియా పొగాకు వేలం కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వేలం ప్రక్రియను పరిశీలించి, రైతులతో పొగాకు సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వేలం ప్రక్రియ బాగానే ఉన్నప్పటికీ ధర ఆశాజనకంగా లేదని, ధర పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని కోరారన్నారు. దీనిపై త్వరలో వ్యాపారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ వేసవిలో ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంటుందని, దీంతో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు వేలంలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ఈ ఏడాది వేలం ప్రక్రియకు 200 మిలియన్ కిలోలు దాటి పొగాకు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు వారి క్లస్టర్‌లో ఇచ్చిన బేళ్లను వేలం ప్రక్రియలోకి సత్వరమే తీసుకురావాలన్నారు. తెలివిగా వ్యవహరిస్తూ వారి వద్ద ఉన్న పొగాకును వేలంలో ఉంచుతూనే సరాసరి పెంచుకునేందుకు కృషిచేయాలని చెప్పారు. ఈ ఏడాది వర్జీనియా పొగాకు వేలం ప్రక్రియ త్వరగా ప్రారంభమైనందున రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారి వద్ద ఉన్న పొగాకు విక్రయించుకోవాలన్నారు. మార్కెట్ ఈ ఏడాది ఆశాజనకంగా ఉండొచ్చని బ్రెజిల్, జింబాబ్వేలో ఈ ఏడాది పొగాకు తక్కువగా పండిందని చెప్పారు. మిచాంగ్ తుఫాను రైతులను దెబ్బతీసినప్పటికీ అధైర్య పడకుండా రైతులు వర్జీనియా సాగు చేశారన్నారు. మిచాంగ్‌తో 70 శాతం పొలాలు నష్టపోయాయని, పెట్టుబడులు పెరిగాయని అయినా రైతులు ఉత్సాహంగా పొగాకును పండించడం అభినందనీయం అన్నారు. పండుగుల్ల వేలం ప్రక్రియ కూడా పొగాకు బోర్డు పరిధిలోకి వస్తుంది. బ్యారన్‌లో క్యూర్ చేసినా చేయకపోయినా పండుగుల్లను ఆక్షన్‌లోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య, వేలం అధికారి శ్రీహరి, సురేంద్ర, రైతు సంఘాల నాయకులు ఘంటశాల గాంధీ, పరిమి రాంబాబు, సత్రం వెంకటరావు, వీవీఎస్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన మహిళలను సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (టూటౌన్): స్థానిక ఏటిగట్టు ప్రాంతానికి చెందిన వంద మందికి పైగా మహిళలు, కార్యకర్తలు తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని క్యాంపు కార్యాలయంలో వీరికి పార్టీ కండువాలు కప్పిన పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏటిగట్టు ప్రాంత ప్రజలు మాట్లాడుతూ ఏలూరుని అభివృద్ధి చేసింది ఎమ్మెల్యే ఆళ్ల నాని అని గుర్తు చేసారు. ఏటిగట్టు ప్రాంతానికి రివిట్‌మెంట్ వాల్ నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి సంక్షేమ పథకాల వల్ల తమ పిల్లలు ఎంతో లబ్ధి పొందారని చెప్పారు. ఈ సారి ఏలూరులో గెలిచేది ఆళ్ల నాని అని, రాష్ట్రంలో రెండోసారి సీఎం పీఠం ఎక్కేది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంటూ నినాదాలు చేశారు.

వినియోగదారుల కమిషన్ వైస్ చైర్మన్లుగా ఎంపిక



నియామక పత్రాలు అందిస్తున్న వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్ మణికంఠ

నిడమర్రు: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఉమ్మడి పశ్చిమగోదారి వైస్ చైర్మన్లుగా పూళ్ల గ్రామానికి చెందిన నోచర్ల శ్రీనివాసరావు, బువ్వనపల్లికి చెందిన సంకు నాగేశ్వను నియమించినట్లు కమిషన్ చైర్మన్ ఎల్ఎస్ మణికంఠ తెలిపారు. బుధవారం బువ్వనపల్లిలోని జిల్లా ఈస్ట్‌జోన్ కార్యాలయంలో వారికి నియామక పత్రాలు, ఐడీ కార్డులు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, నాగేశ్వలు మాట్లాడుతూ వినియోగదారుడికి కమిషన్ అందుబాటులో ఉండేలా జిల్లా నలుమూలల కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కె.భార్గవి, కె.కార్తీక్, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 23,629 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 139 కేంద్రాల్లో ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 24,067 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 23,374 మంది హాజరయ్యారు. ఒకసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు 1,135 మందికి 325 మంది హాజరు కాగా 810 మంది గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 48 పరీక్షా కేంద్రాలను, జిల్లా పరిశీలకులు 5 పరీక్షా కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి 6 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ 4 పరీక్షా కేంద్రాలను మొత్తంగా 63 కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీ చేశారు. ఈ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

దెందులూరులో టీడీపీకి భారీ షాక్



వైఎస్సార్‌సీపీలోకి చేరిన నేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి: దెందులూరు నియోజకవర్గంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ముండూరు గ్రామంలో బుధవారం రాత్రి పెద్ద ఎత్తున టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధికి, దెందులూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరారు. పెదవేగి మండలం ముండూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గారపాటి వాసు, పలువురు టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి వైఎస్సార్సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోస్టర్లు, బ్యానర్లు తొలగింపు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఎన్నికల కోడ్ సందర్భంగా రాజకీయ ప్రకటనలకు సంబంధించి 36,146 పోస్టర్లు, బ్యానర్లు, ఫొటోలు తొలగించామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో పబ్లిక్ ఆస్తుల వద్ద మొత్తం 21,581 పోస్టర్లు, బ్యానర్లు తొలగించామన్నారు. ప్రైవేట్ ప్రదేశాలలో 14,558 పోస్టర్లు, బ్యానర్లు తొలగించామన్నారు.

● రమణీయం.. రథోత్సవం



తణుకు టౌన్: దువ్వలో వేణుగోపాలస్వామి రథోత్సవం



అత్తిలి: బల్లిపాడులో మదనగోపాలస్వామి రథోత్సవం

జయ జనార్దనా కృష్ణా.. నంద నందనా కృష్ణా.. స్మరణలు మార్మోగాయి.. శ్రీకృష్ణుడి రథోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. అత్తిలి మండలం బల్లిపాడులో మదనగోపాలస్వామి రథోత్సవం, తణుకు మండలం దువ్వలో రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం రథోత్సవాలు జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన రథాలపై స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి బాణసంచా కాల్పులు, మేళతాళాల నడుమ రథోత్సవాలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- అత్తిలి/తణుకు టౌన్

ఏసీబీ డీఎస్పీగా సుబ్బరాజు



వీ సుబ్బరాజు, ఏసీబీ డీఎస్పీ

ఏలూరు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అవినీతి నిరోధకశాఖ డీఎస్పీగా వి.సుబ్బరాజు నియమితులయ్యారు. ఆయన బుధవారం ఏలూరులో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 1995 ఎస్సై బ్యాచ్‌కు చెందిన సుబ్బరాజు తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాల్లో ఎస్ఐ, సీఐగా పనిచేసి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏసీబీ సీఐగా పనిచేశారు. డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన విజయవాడ ఏసీబీ డీఎస్పీగా పనిచేశారు. అనకాపల్లి ఎస్‌డీపీఓగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అవినీతి అధికారుల సమాచారాన్ని అందించాలన్నారు. 14400కు లేదా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏసీబీ డీఎస్పీ 9440446157కి గాని సీఐల నెంబర్లు 9440446158, 9440446159కు సమాచారం అందించాలన్నారు. అక్రమాస్తుల సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులు ఎవరైనా తమ పనులు చేయకుండా లంచం డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలని కోరారు.

క్లుప్తంగా

పేకాట కేసులో టీడీపీ నేతల అరెస్ట్?

ఏలూరు టౌన్: ఏలూరు పోణంగి రోడ్డులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి బుధవారం చెప్పారు. నిందితుల నుంచి రూ.13,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అరెస్ట్ అయిన నిందితుల్లో టీడీపీ నేతలు ఉన్నట్లు సమాచారం.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం లభ్యం

ఏలూరు టౌన్: అనుమానాస్పద స్థితిలో రైలు పట్టాలపై ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కృష్ణా జిల్లా తేలప్రోలుకు చెందిన మంగదుడ్డి సుధాకర్‌కు భార్య రజని, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం అతను తేలప్రోలు రైల్వేస్టేషన్ రైల్వే గేటు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మద్యం మత్తులో ఇద్దరిపై కత్తితో దాడి


దాడికి పాల్పడిన యువకుడు చాణుక్య

ఏలూరు టౌన్: విదేశాల్లో వైద్య విద్య అభ్యసిస్తున్న ఓ యువకుడు మద్యం మత్తులో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులపై కత్తితో దాడికి తెగబడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన పాలడుగు చాణుక్య విదేశాల్లో వైద్య విద్యను అభ్యసిస్తుండగా ఆఖరి పరీక్ష రాయాల్సి ఉంది. ప్రస్తుతం చాణుక్య ఏలూరులో ఉంటున్నాడు. ఇంటి పక్కన జాలిపూడికి చెందిన ఎస్.దుర్గా సురేష్ వడ్రంగి పనిచేస్తున్నాడు. మిషనరీ శబ్దం వస్తోందని పని ఆపేయాలని చాణుక్య కోరగా, పనిచేసేటప్పుడు శబ్దం వస్తుందని సురేష్ చెప్పడంతో ఆగ్రహించిన చాణుక్య చాకుతో రెండు చేతులపై, వీపుపై సురేష్‌ను పొడిచాడు. గాయాలపాలైన దుర్గాసురేష్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మరో ఘటనలో బుధవారం మధ్యాహ్నం పత్తేబాద డీమార్ట్ సమీపంలో కారులో వెళుతున్న ఓ వ్యక్తి హార్న్ కొట్టాడు. అదే సమయంలో మోటారు సైకిల్‌పై వస్తున్న చాణుక్య ఆగ్రహించి వెంటనే తన బ్యాగ్‌లో ఉన్న కత్తి తీసి కారు నడిపే వ్యక్తిపై దాడి చేసి వేలు, చేతులపై పొడిచాడు. దీంతో ఇరుగుపొరుగు వారు అతన్ని నిర్బంధించి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. రెండు ఘటనలపై ఏలూరు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడవులపైనే మానవుని భవిత

- వాతావరణ సమతుల్యతకు అడవుల పాత్ర కీలకం
- పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదం
- రానురాను తగ్గుతున్న అడవుల విస్తీర్ణం
- అడవుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.32 లక్షల హెక్టార్లలో అడవి
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం


పశ్చిమ మన్యంలో అటవీ ప్రాంతం

బుట్టాయగూడెం: భారీ వృక్షాలు, ఎత్తైన కొండలు, లోయలు, వాగులు, వంకలు, సెలయేళ్లు, వన్యమృగాలు, పచ్చని అందాలతో అలరారే అడవుల మనుగడ రానురాను ప్రశ్నార్థకమవుతోంది. ప్రజల్లో అవగాహన లోపం వల్ల అడవుల విస్తీర్ణం రానురాను తగ్గిపోతోంది. మానవుల మనుగడలో అడవుల పాత్ర ఎంతో కీలకం. కాలుష్య నివారణ, స్వచ్ఛమైన గాలి, నీటి సంరక్షణకు అడవుల ప్రాముఖ్యత చాలా ఉంది. అడవుల సంరక్షణ కోసం ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నా యథేచ్ఛగా అడవిలో చెట్లను నరికి కలపను అక్రమంగా తరలించేస్తున్నారు. కలప అక్రమ రవాణా పై అధికారులు ప్రత్యేక నిఘాతో కేసులు పెట్టి నిందితులను పట్టుకున్నా కలప అక్రమ రవాణా ఆగడం లేదు. అంతరించిపోతున్న అడవులపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మొదటిసారిగా ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 1971లో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ప్రారంభించారు. మన దేశంలో 2013 మార్చి 21వ తేది అటవీ దినోత్సవం నిర్వహించారు. అప్పటి నుంచి అడవులపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలి. ముఖ్యంగా అడవుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉంది.

85 శాతం ఏజెన్సీలోనే..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా అడవి విస్తీర్ణం 1.32 లక్షల హెక్టార్లల్లో విస్తరించి ఉంది. ప్రభుత్వం లెక్కల ప్రకారం అధికంగా 85 శాతం అడవి ఏజెన్సీ ప్రాంతంలోనే ఉంది. బుట్టాయగూడెం, కుక్కునూరు, పోలవరం, వేలేరుపాడు, జీలుగుమిల్లి ఐదు గిరిజన మండలాల్లో 1,12,445 హెక్టార్లలో విస్తరించి ఉంది. జిల్లాలోని ఇతర మండలాల్లో అటవీ విస్తీర్ణం వివరాలను పరిశీలిస్తే.. బుట్టాయగూడెం మండలంలో 21,879 హెక్టార్లు, పోలవరం మండలంలో 27,927, హెక్టార్లు, జీలుగుమిల్లిలో 8,903, వేలేరుపాడులో 29,476 హెక్టార్లు, కుక్కునూరులో 22,259, టి.నర్సాపురంలో 4,384, చింతలపూడిలో 6,580, కామవరపుకోటలో 1,178, లింగపాలెంలో 2,119, గోపాలపురంలో 649, ద్వారకాతిరుమలలో 813, నల్లజర్లలో 2,174, పెదవేగిలో 1,332, ఉంగుటూరు మండలంలో 1,226 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒకప్పుడు 23 శాతంగా ఉన్న అడవులు ప్రస్తుతం 22.02 శాతానికి తగ్గినట్టు తెలుస్తోంది.

పర్యావరణ పరిరక్షణలో కీలకం

కార్బన్ వాయువులను పీల్చుకోవడంలో అడవులు కీలకపాత్ర పోషిస్తున్నాయని గతంలో జరిగిన అనేక పరిశోధనల్లో తేలాయి. వాటిని నమ్మి ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రదేశాల్లో అడవులను పెంచడం ప్రారంభించారు. అలాగే సహజసిద్ధంగా కూడా అడవులు ఉన్నాయి. వాతావరణంలోని కార్బన్ డైయాక్సైడ్, ఆక్సిజన్ సమతుల్యతలను కాపాడడంలో అడవులు కీలకపాత్ర పోషిస్తాయి. అదేవిధంగా అడవులు జంతుజలాలకు నిలయంగా ఉన్నాయి. అలాగే పెరుగుతున్న గాలి ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో కూడా అడవులు సహాయపడతాయి. తద్వారా వాతావరణాన్ని చల్లగా, వెచ్చగా ఉంచుతుంది. ఇలా ఎంతో ఉపయోగకరమైన అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

చెట్లు నరికితే కఠిన శిక్షలు

అడవులను కాపాడుకుంటేనే రేపటి తరాలు ఆనందంగా, ఆరోగ్యంగా జీవించగలరు. అడవిలో చెట్లను నరికితే కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అడవుల్లో ఉన్న ఇరుగుడు సేవ, టేకు వంటి విలువైన వృక్షాలను నరికిన వ్యక్తులను ఫారెస్ట్ అధికారులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తారు. కోర్టులో నేరం రుజువైతే సుమారు ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే వృక్షానికి వెలకట్టి దానిని 10 రెట్ల మేర జరిమానా విధించే అవకాశం కూడా ఉంది. అయితే అభయారణ్యంలో చెట్లు నరికినా, వన్యప్రాణులను వేటాడినా కఠినమైన శిక్షలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అడవుల రక్షణకు ప్రజలు సహకరించాలి



అడవుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అడవుల్లో చెట్ల నరికివేతపై నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే అనేక మందిని పట్టుకుని కేసులు నమోదు చేశాం. అడవిలో ప్రవేశించకుండా అడవి చుట్టూ రక్షణ ఏర్పాటు చేస్తున్నాం. అదేవిధంగా అడవులు అంతరించిపోతే కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం. అదేవిధంగా చెట్లు నాటే కార్యక్రమాన్ని కూడా చేస్తున్నాం. ప్రజలందరూ సహకరించాలి.

– దావీదు రాజు నాయుడు, ఫారెస్ట్ రేంజ్ అధికారి, పోలవరం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

- భర్త మృతి, భార్య, కుమార్తెకు గాయాలు
- తుని నుంచి వెలమావారిపాలెం వెళుతుండగా ఘటన
- ఏలూరు సమీపంలో హైవే వద్ద ప్రమాదం

ఏలూరు టౌన్: ద్విచక్రవాహనంపై వెళుతూ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా, భార్య, కుమార్తెకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా చవలపురం మండలం వెలమావారి పాలెంనకు చెందిన ఉయ్యాల రమేష్ (28), భార్య వెంకట లక్ష్మి, ఏడాదిన్నర వయస్సు ఉన్న హర్షశ్రీ అనే కుమార్తె ఉన్నారు. కూలీ పనుల నిమిత్తం కొంత కాలం క్రితం తుని వెళ్లి తిరిగి బుధవారం ఉదయం మోటారు సైకిల్‌పై భార్య, కుమార్తెతో కలిసి స్వగ్రామానికి బయలుదేరారు. 16వ నంబర్ జాతీయ రహదారిపై వెళుతుండగా ఏలూరు సమీపంలో ఓ హోటల్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రమేష్ అక్కడికక్కడే మృతి చెందగా, భార్య, కుమార్తెకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్సై కె రాజారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి


సత్యనారాయణ మృతదేహం

ఏలూరు రూరల్: పిడుగుపాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని చొదిమెళ్లలో పిడుగులు పడ్డాయి. భీకరమైన శబ్దంతో కూడిన ఓ పిడుగు తాటిచెట్టు సమీపంలో పడింది. అదే సమయంలో అక్కడ సంచరిస్తున్న రావూరి సత్యనారాయణ అనే వ్యక్తి పిడుగుపాటుకు గురయ్యాడు. స్థానికులు గుర్తించి హుటాహుటిన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. పిడుగు కారణంగా తాటిచెట్టుకు నిప్పు అంటుకుంది.

సొసైటీలో ఎన్ఎంఆర్ ఉద్యోగుల తొలగింపు

సొసైటీ గేటు వద్ద ఆందోళన

భీమడోలు: గుండుగొలను సొసైటీలో నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన 9 మంది ఎన్ఎంఆర్ ఉద్యోగులను కో–ఆపరేటివ్ చట్టం అనుసరించి వారిని విధుల నుంచి మంగళవారం తొలగించారు. ఈ తరుణంలో బుధవారం కొందరు ఉద్యోగులు సొసైటీ ప్రధాన గేటు వద్ద బైఠాయించి సొసైటీ రెగ్యులర్ ఉద్యోగులను లోనికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. తమను అన్యాయంగా తొలగించారని, తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సొసైటీ కార్యదర్శి రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనంతరం పోలీసులు వచ్చి వారితో చర్చించి ఆందోళన విరమింపచేశారు. దీనిపై కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ తొలగింపబడిన 9 మంది అవుట్‌సోర్సింగ్‌లోని ఎన్ఎంఆర్ ఉద్యోగులకు నియామక పత్రాలు, సరైన ధ్రువీకరణ పత్రాలు, జాయినింగ్ ఆర్డర్లు లేవన్నారు.

జలదుర్గా గోకర్ణేశ్వరుని కల్యాణం చూతము రారండి

- నేడు కొల్లేటికోటలో కల్యాణ మహోత్సవం
- కొత్తగా ఎడ్లబండిపై పంచభోగ ప్రసాదాలు


పెద్దింట్లమ్మకు ఈ ఏడాది నుంచి పంచభోగ ప్రసాదాలు పంపిణీ ఉహా చిత్రం


కొల్లేటికోట పెద్దింట్లమ్మకు బోనాలు (ఫైల్)


కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర (తీర్థం) మహోత్సవం వైభవోపేతంగా కొనసాగుతోంది. జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామి కల్యాణం గురువారం రాత్రి నిర్వహించనున్నారు. కల్యాణోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే పూర్తి చేశారు. సమీప గోకర్ణపురం నుంచి గోకర్ణేశ్వర స్వామి (శివుడు)ను పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చి జలదుర్గాదేవీ (పార్వతీ)తో కల్యాణం జరపడం 11వ శతాబ్దం నాటి వేంగి–చాళుక్యరాజుల కాలం నుంచి జరుగుతోంది. దేశవిదేశాల నుంచి, ఇతర జిల్లాలు, కొల్లేరు గ్రామాల నంచి ప్రతి కుటుంబం కల్యాణాన్ని తిలకించేందుకు తరలిరానుంది. ఈ ఏడాది ప్రత్యేకంగా అతిపెద్ద మహా అనివేటి మండపం నిర్మాణం పూర్తి కాగా, జాతరకు వచ్చే భక్తుల రాకపోకలకు వీలుగా సర్కారు కాలువపై పెద్దింట్లమ్మ వారధి నిర్మించారు. ఆలయ ఈవో కేవీ గోపాలరావు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును తెనాలికి చెందిన రాము గుర్కుల్, వేదపారాయణాన్ని విశ్వేశ్వరశర్మ, కల్యాణ వ్యాఖ్యానము ఐలూరు రామకృష్ణ శర్మ నిర్వహించనున్నారు. కల్యాణం నిమిత్తం సీఐ బి.కృష్ణకుమార్ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.

పెద్దింట్లమ్మకు పంచభోగ ప్రసాదాలు

తెలంగాణలో బోనాల సంప్రదాయాన్ని ఐదేళ్లుగా కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో కల్యాణం రోజున నిర్వహిస్తున్నారు. దీనిని పురస్కరించుకుని ఈ ఏడాది నుంచి పందిరిపల్లిగూడెం నుంచి పంచభోగ ప్రసాదాలు (చక్కెర పొంగలి, పులిహోరా, గారె, బూరి, బూందీ) గురువారం రాత్రి 8.30 గంటలకు గ్రామ సర్పంచ్ బలే వెంకటరమణ సముద్రుడు, బోనాల నిర్వాహకుడు బాలాజీ ఆధ్వర్యంలో ఎడ్లబండిపై ఊరేగింపుగా తీసుకురానున్నారు. కల్యాణం తిలకించడానికి వచ్చిన భక్తులకు వీటిని నైవేద్యంగా అందించనున్నారు. ఇకపై ప్రతి ఏటా ఈ సంప్రదాయం కొనసాగనుంది. మరోవైపు ఏలూరు జిల్లాలోని కొల్లేరు గ్రామాలకు చెందిన అన్ని గ్రామాల మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పందిరిపల్లిగూడెం నుంచి ప్రభల బండి, బోనాల గ్రామోత్సవం జరగనుంది. కల్యాణం రోజున నాదస్వరవాయిద్యం, గరగ నృత్యం, శక్తివేషాలు ప్రదర్శనలు ఏర్పాటు చేశాం. దేవదాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– కేవీ గోపాలరావు, ఈఓ, పెద్దింట్లమ్మ దేవస్థానం, కొల్లేటికోట

పది పరీక్షలకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ డి.మేరీప్రశాంతి
- ఏలూరులో పది పరీక్షా కేంద్రాల పరిశీలన


కస్తూరిబా హైస్కూలులో మాట్లాడుతున్న ఎస్పీ డి.మేరీప్రశాంతి

ఏలూరు (టూటౌన్): ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఎస్పీ సుడిగాలి పర్యటన ద్వారా బుధవారం సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లు మూసి వేయించామని, పరీక్ష పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పాటించాల్సిన నియమ నిబంధనలను తప్పనిసరిగా అందరూ పాటించాలన్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపైచట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు. ఎస్పీ వెంట ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, ఎస్సై లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు

భీమవరం: సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగ పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేసేందుకు ఏప్రిల్‌లో వైద్య నిర్ధారణ శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్, సహిత విద్య రాష్ట్ర సహాయ సమన్వయకర్త డాక్టర్ ఎస్.రాధిక చెప్పారు. బుధవారం పట్టణంలోని భవిత శిక్షణా కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రత్యేక ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సహిత విద్య రిసోర్స్ పర్సన్స్ దివ్యాంగ పిల్లల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వైద్య నిర్ధారణ శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా పాటుపడాలన్నారు. జిల్లా సహిత విద్య, సమన్వయకర్త సీహెచ్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, సహిత విద్య సహాయ సమన్వయకర్త టి.శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్స్ లిల్లీ గ్రేస్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఏడుస్తూ వచ్చారు.. ఫోన్‌తో ఉడాయించారు

నరసాపురం: కాల్ చేసుకుంటామని చెప్పి ఓ వ్యక్తి నుంచి ఫోన్ తీసుకుని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై పరారయ్యారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చిత్రసేన మునిసిపాలిటీలో శానిటేషన్ ట్రక్కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం జె.సికిలే స్కూల్ రోడ్డులో నడిచి వెళుతున్నాడు. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు ఏడుస్తూ వచ్చి జాతరలో తమ అబ్బాయి తప్పిపోయాడని, బంధువులకు సమాచారం ఇవ్వాలని, ఒకసారి ఫోన్ ఇవ్వాలని చిత్రసేనను కోరారు. దీంతో అతను ఫోన్ ఇవ్వగా, కాల్ చేస్తున్నట్లు నటిస్తూ పక్కనే పార్కు చేసి ఉన్న బైక్‌ను స్టార్ట్ చేసుకుని ఫోన్‌తో ఉడాయించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఏప్రిల్‌లో ట్రిపుల్‌ఐటీలో టెక్‌జైట్


టెక్‌జైట్-24 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్, డైరెక్టర్ చంద్రశేఖర్

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో వచ్చేనెల 12, 13, 14 తేదీల్లో సాంకేతిక ఉత్సవం టెక్‌జైట్–24ను నిర్వహిస్తున్నట్లు ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య విజయకుమార్ చెప్పారు. సాంకేతిక ఉత్సవానికి సంబంధించిన పోస్టర్, వెబ్‌సైట్‌ను బుధవారం నూజివీడు ట్రిపుల్‌ఐటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో దేశంలోని అనేక యూనివర్సిటీలు, ఐఐటీలు, ఎన్ఐటీలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు. దీని ద్వారా సాంకేతిక విద్యకు సంబంధించిన విషయాలను ఒకరికొకరు పంచుకోవడానికి వీలవుతుందన్నారు. విద్యార్థుల నాయకత్వ లక్షణాలు సైతం పెరుగుతాయన్నారు. వివిధ కంపెనీలను, రీసెర్చ్ సంస్థలను ఈ టెక్‌ఫెస్ట్‌కు ఆహ్వానిస్తున్నామన్నారు. డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటీ, ఎన్ఐటీ, ఇతర ఇంజినీరింగ్ కళాశాలలకు ఆహ్వాన పత్రికలను పంపామన్నారు. ఈ టెక్‌ఫెస్ట్‌లో దాదాపు ఐదు వేల మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. స్టూడెంట్ డెవలప్‌మెంట్ అండ్ క్యాంపస్ యాక్టివిటీ సెంటర్ (ఎస్‌డీసీఏసీ) ఆధ్వర్యంలో సాంకేతిక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో రోబోటిక్స్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, అన్ని ఇంజినీరింగ్ విభాగాల ప్రాజెక్స్, ఈవెంట్స్ నిర్వహిస్తామన్నారు. పోటీల్లో విజేతలకు మొత్తం రూ.4 లక్షల విలువైన బహుమతులను అందజేస్తున్నామన్నారు. ఇందులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్‌వీవీవీ గోపాలరాజు, యూనివర్సిటీ డీన్ శ్రావణి, ఎస్‌డీసీఏసీ కన్వీనర్ బీ జ్యోతీలాల్‌నాయక్, డీన్ అకడమిక్స్ రత్నాకర్, ఏవో చంద్రశేఖర్, పలు శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

స్నేహితుడిపై గొడ్డలితో దాడి

- వివాహేతర సంబంధం అనుమానంతోనే హత్యాయత్నం
- పరిస్థితి విషమం, విజయవాడ తరలింపు, కొత్తూరులో ఘటన


తలపై గాయంతో చిచ్చడి కృష్ణ


గ్రామంలో విచారణ చేస్తున్న ఎస్సై లక్ష్మీనారాయణ

వేలేరుపాడు: వివాహేత సంబంధం ఉందనే అనుమానంతో స్నేహితుడిపై గొడ్డలితో దాడి చేశాడు ఓ వ్యక్తి. కొత్తూరులో మంగళవారం అర్ధ రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుమెట్ట గ్రామానికి చెందిన చిచ్చడి కృష్ణ, కొత్తూరు గ్రామానికి చెందిన కురసం వెంకటేష్ స్నేహితులు. కృష్ణ తరచూ వెంకటేష్ ఇంటికి వచ్చి వెళుతుంటాడు. ఈ నేపథ్యంలో భార్య జలపమ్మ ప్రవర్తనపై భర్త వెంకటేష్‌కు అనుమానం ఉంది. ఇదిలా ఉండగా, మంగళవారం రాత్రి జలపమ్మ ఫోన్‌కు చిచ్చడి కృష్ణ ఏడుసార్లు కాల్స్ చేయగా, భర్త వెంకటేష్ గమనించి కృష్ణకు ఫోన్ ఎందుకు చేశావంటూ ప్రశ్నించాడు. మద్యం కావాలని చేశానని భార్య చెప్పగా, మద్యం ఎక్కడ దొరుకుతుందో తనకు తెలుసని, కృష్ణకు చెప్పాడు. అయితే కృష్ణ ద్విచక్రవాహనంపై నేరుగా వెంకటేష్ ఇంటికి వచ్చాడు. అప్పటికే చుట్టుపక్కల కాపు కాసి ఉన్న వెంకటేష్ ఇంటికి చేరుకుని భార్యతో గొడవకు దిగాడు. అక్కడే ఉన్న కృష్ణ వీరిద్దరిని వారించేందుకు ప్రయత్నించగా, అసలు గొడవంతా నీవల్లేనంటూ గొడ్డలితో కృష్ణ తలపై వేటు వేశాడు. దీంతో కృష్ణ తలకు తీవ్ర గాయమై కింద పడిపోయాడు. చుట్టుపక్కలవారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో 108లో వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కృష్ణ పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బుధవారం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు వెంకటేష్‌ను పోలీసులు బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. కుక్కునూరు సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో వేలేరుపాడు ఎసైస లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.